క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం పూజలు నిర్వహించారు. వీరఘట్టం ప్రాంతానికి చెందిన యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో పురోహితులు పులఖండం కృష్ణమూర్తిశాస్త్రి, ఆరవెల్లి రాంబాబుశాస్త్రి భక్తులతో పంచముఖ ఆంజనేయ, శరవణ భవ, సుబ్రహ్మణ్య, వాల్మీక నాగరూప ఆరాధన, క్షీరాధివాసం, ధాన్యాదివాసం, హోమాలు, మహామంత్రపుష్పం, సువర్ణమంత్రపుష్పం వంటి పూజలు చేయించారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత ఉమామహేశ్వరరావు

రేగిడి: మండలంలోని లచ్చనవలస గ్రామంలో కామోదుల నారాయణరావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని భార్య ఆదిలక్ష్మికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలను వైఎస్సార్ సీపీ నేత మీసాల ఉమామహేశ్వరావు చేతుమీదుగా మంగళవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలను ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు

సంతకవిటి: మండలంలోని చిన్నయ్యపేటలో బుధవారం నుంచి అభయాంజనేయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వేదపండితులు పులఖండం శ్రీధర్ శర్మ, రంప కోదండరామ శర్మల సంయుక్త ఆధ్వర్యంలో దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా 5వ తేదీన విగ్రహానికి ప్రాణప్రతిష్ట, మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సర్పంచ్ మృతికి సంతాపం



తెంటు లక్ష్మం నాయుడు(ఫైల్)

బాడంగి: మండలంలోని పిన్నవలస గ్రామ సర్పంచ్ తెంటు లక్ష్మంనాయుడు (84) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. 15 రోజులుగా అస్వస్థతతో బాధపడిన ఈయన తన ఇంటి వద్దే తుదిశ్వాస విడిచాడు. ఈయన మృతికి పలువురు తమ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జక్కువలో తనిఖీలు



జక్కువలో బెల్టు షాపులు నిర్వాహకుల ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్న సిబ్బంది

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామంలో ఇటీవల బెల్టుషాపులు నిర్వహణ కోసం వేలం పాట వేసినట్లు తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది సీఐ విజయలక్ష్మీ ఆదేశాల మేరకు మంగళవారం ఆ గ్రామంలోని బెల్టు షాపుల నిర్వాహకుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. గ్రామంలోని అక్రమంగా మద్యం అమ్మినట్లు తమ దృష్టికి వచ్చినట్టయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బెల్టుషాపులు నిర్వహణ కోసం ఎటువంటి వేలం పాట పెట్టినా ఉపేక్షించేది లేదని సిబ్బంది గ్రామస్తులకు తెలిపారు. తనిఖీలలో ఎక్సైజ్ సిబ్బందితో పాటు స్థానిక మహిళా పోలీస్ షరీఫ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉమాసోమేశ్వరుల కల్యాణం



ఉమాసోమేశ్వర కల్యాణం

బాడంగి: మండల కేంద్రంలోని ఉమాసోమేశ్వరాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతున్నాయి. గ్రామపెద్దల సమక్షంలో గ్రామస్తులు కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకతో జరుపుకుంటున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులకు మంగళవారం ఊరేగించారు.

వైభవంగా దాడితల్లి సిరిమానోత్సవం

- పోటెత్తిన భక్తజనం
- దర్శించుకున్న ప్రముఖులు





ఆకట్టుకున్న బళ్ల వేషాలు, విచిత్ర వేషధారణలు



సిరిమాను నుంచి ఆశీర్వచనాలు ఇస్తున్న పూజారి



పొడగరి వేష ధారణ



ఘటాలు ఎత్తుకున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి



సిరిమాను వద్ద ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ చైర్మన్ మురళీ కృష్ణారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వేణు గోపాలనాయుడు పూజలు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ముహూర్త సమయానికి సిరిమాను రథం జై దాడితల్లి, జైజై దాడితల్లి అన్న భక్తుల నినాదాల మధ్య కదిలింది. గొల్లపల్లితో పాటు 12 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవంగా భావించే భక్తులు తమ మొక్కులు తీర్చుకుని దాడితల్లికి ప్రణమిల్లారు. గొల్లపల్లి పైల వీధిలో పూజారి బత్తిన సూరిబాబు సిరిమానును అధిరోహించారు. సిరిమానోత్సవానికి ఉత్తరాంధ్ర, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. పైల వీధిలో సిరిమాను ప్రారంభమై భక్తుల జయజయధ్వానాల మధ్య కీడురాయి వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి దాడితల్లి కాలనీలో ఊరేగింది. అక్కడి నుంచి ప్రధానరహదారి మీదుగా పట్టణంలోకి ప్రవేశించింది.

ఆకట్టుకున్న బళ్ల వేషాలు:
సంప్రదాయ బళ్ల వేషాల అంకం గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి జాతరలో నేటికీ కొనసాగుతోంది. అందులోని కొత్త ఒరవడిని కలగలిపి బళ్ల వేషాలు పండుగకు ఏటా కొత్త రూపు తీసుకువచ్చి భక్తులకు కనువిందు చేస్తున్నాయి. వీటితో పాటు విచిత్ర వేషధారణలు, కాళిమాతల ప్రదర్శనలు అలరించాయి. ఈ సారి కొత్తగా భారీ కాయంతో ఉన్న శివ రూపుడి ప్రదర్శన ఆకట్టుకుంది.

తృటిలో తప్పిన ముప్పు
సిరిమానోత్సవ రథాన్ని పైల వీధిలో తిప్పి వెనక్కి మళ్లించినపుడు విద్యుత్ స్తంభానికి చిన్నగా రాసుకుంటూ కాసేపు ఆగింది. అంతకు ముందు కాసేపు మొరాయించింది. అనంతరం జై దాడితల్లి అంటూ భక్తుల నినాదాలతో సిరిమాను ముందుకు కదిలిపోయింది.

ప్రముఖుల దర్శనం
దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం నాడు ఏటా దర్శించుకునే ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సోదరుడు శంబంగి వేణుగోపాల నాయుడితో కలిసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి సిరిమాను వద్ద పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు సిరిమాను వద్ద, ఆలయంలోనూ దాడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి ఆర్‌వీఎస్‌కే రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్‌వీఎస్‌కేకే రంగారావులు సిరిమానోత్సవానికి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు, తహసీల్దార్ రాజారావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కార్లు, ద్విచక్ర వాహనాలను 200మీటర్ల ముందుగానే నిలిపివేశారు. అలాగే రాజాం – బొబ్బిలి మధ్యలో తిరిగే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను అప్పయ్యపేట మీదుగా మళ్లించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. దీంతో సిరిమానోత్సవం ప్రశాంతంగా సాగింది.

బోరుబావి ప్రారంభం

తెర్లాం: ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణ కాలనీల్లో నిర్మించిన బోరుబావిని కాలనీవాసులంతా సక్రమంగా వినియోగించుకోవాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ అన్నారు. తెర్లాంలోని జగనన్న కాలనీలో వేసిన బోరుబావిని మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ఎన్నడు లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలను నిర్మించడం, ఆ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. జగనన్న కాలనీలో ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరుబావులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన నిధులతో తీయించారని తెలిపారు. బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో నూతనంగా ప్రారంభమైన వీరమణికంఠ స్వామి(పుట్టలో వెలసిన అయ్యప్పస్వామి) ఆలయాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు స్వామికి ప్రత్యేక పూజలు చేసి, రాష్ట్ర ప్రజలు బాగుండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలి

రాజాం సిటీ: ఉపాధి హామీ పనులు చేపడుతున్న వేతనదారులంతా రోజుకు రూ.272 కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఒమ్మి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజూ రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలోనే పనులు చేయాలని, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్సా కిట్లు, టెంట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సంతకవిటి: ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి హెచ్చరించారు. మండలంలోని పోతులజగ్గపేట, రంగారాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన నిర్దేశిత కొలతల్లో ఇచ్చిన పనిని సక్రమంగా చేయాలని వేతనదారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ త్రినాధరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి విజయనగరం జిల్లా భోగాపురానికి బుధవారం ఉదయం 9గంటలకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం పర్యటనకు, బహిరంగ సభకు బొబ్బిలి నియోజకవర్గంలో నుంచి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో పాటు నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

బాధితునికి పెన్షన్ మంజూరు



బాధితుడికి పెన్షన్ అందజేస్తున్న సర్పంచ్ చిన్నంనాయుడు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పోతురాజు రమణకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల పెన్షన్‌ను సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు చేతులమీదుగా మంగళవారం అందజేశారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే స్పందించిన ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉందని బాధితుడు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు యూనిఫాంలు

బొబ్బిలి: మండలంలోని పారాదిలో ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు స్థానిక నాయకుడు అల్లాడ నగేష్ తదితరులు యూనిఫాంలు అందజేసినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

నూతన పైపులైన్ ఏర్పాటు



నూతన పైపులైన్‌కు గోతులను తవ్వుతున్న కార్మికులు

మెంటాడ: మండల కేంద్రంలోని తాగునీరు ట్యాంకు నుండి గ్రామంలోని అన్ని వీధుల్లోకి సరఫరా అయ్యే పైపులైన్ పూర్తిగా పాడవ్వడంతో మళ్లీ నూతన పైపులైన్ ఏర్పాటుకు మంగళవారం గోతులను తవ్వించినట్లు సర్పంచ్ రేగిడి రాంబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఎగువవీధి నుండి హరిజన వీధి వరకూ నూతన పైపు లైన్ రూ.3లక్షలతో వేయడం జరుగుతుందన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



కస్పా వీధిలో ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని కస్పా, బుక్కా, చిక్కాల వారి వీధుల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందజేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇవే కాకుండా సభలు, సమావేశాలు, సదస్సులు, పాదయాత్ర, సంకల్పయాత్రలో ఇచ్చిన మరెన్నో హామీలను నెరవేర్చారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి అన్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే పథకాలు మంజూరవుతున్నాయన్నారు. గతంలోని పాలనకు ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, శాసపు వేణుగోపాలనాయుడు, గోకవలస బాబూరావు, దూబ గోపాలం, గుంటముక్కల సప్తగిరి, ఆసపు సూర్యం, కోల రమ్య, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మెప్మా టీఎంసీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకిన పైడితల్లి సంబరం

- కనుల పండువగా అమ్మవారి సిరిమానోత్సవం
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- అమ్మవారిని సందర్శించుకున్న ఎమ్మెల్యే శంబంగి



శ్రీపైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం



పైడితల్లి అమ్మవారిని దర్శించుకొని సిరిమానుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామ దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. పైడితల్లి అమ్మవారి పండుగలో భాగంగా మంగళవారం సాయంత్రం 4గంటలకు పైడితల్లి అమ్మవారి సిరిమానును పూజారి చిట్టూరి సోమిశెట్టి అధిరోహించగా గ్రామంలోని ఎగువ వీధి, దిగువ వీధితో పాటు అన్ని వీధుల్లో సిరిమానును ఊరేగించారు. సిరిమాను ముందు అంజలి రథాన్ని ఊరేగించారు. పండుగను ఆమిటి గ్రామంతో పాటు మధుర గ్రామాలైన సింగిరెడ్డివలస, సీతారాంపురం, బొంగుపేట గ్రామాల్లో కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. సిరిమానోత్సవాన్ని దర్శించుకొనేందుకు ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆమిటి వచ్చి పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి
ఆమిటి గ్రామంలో జరుగుతున్న శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా మంగళవారం జరిగే సిరిమానోత్సవాన్ని, పైడితల్లి అమ్మవారిని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దర్శించుకున్నారు. అమ్మవారి సిరిమాను రథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు పైడితల్లి అమ్మవారిని దర్శించే వారిలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పార్టీ నాయకులు ఉన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు



కుసుమూరులో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యంనాయుడు

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీసర్వే ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు అన్నారు. మండలంలోని కుసుమూరు గ్రామంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం డ్రోన్ సర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్ల క్రితం భూముల రీసర్వే జరిగిందని, దీంతో గ్రామాల్లోని రైతులు భూముల సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం భూముల రీసర్వే చేయడం, సర్వే సకాలంలో పూర్తయితే భవిష్యత్‌లో భూముల సమస్యలు తలెత్తే అవకాశం లేదన్నారు. మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి త్రినాథ్, సచివాలయ సర్వేయర్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్‌ను ప్రారంభించిన ఎంపీపీ



క్లాప్ కార్యక్రమంలో వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా మరమ్మతులకు గురైన బోరుబావులను బాగు చేసేందుకు చేపట్టిన క్లాప్ ప్రోగ్రాంను మండలంలోని సర్పంచులంతా సద్వినియోగం చేసుకోవాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద క్లాప్ ప్రోగ్రాంను మంగళవారం ఎంపీపీ ఉమాలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లాప్‌లో బోరు మెకానిక్‌లు మండలంలోని అన్ని గ్రామాలకు వస్తారని, బోర్లు మరమ్మతులకు గురైతే సర్పంచ్ వారితో బాగు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఈఓపీఆర్‌డీ రాంబాబు, మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, బోరుమెకానిక్ బోడెల కృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పరిశీలన



ప్రథమ చికిత్సా కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆరాతీస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సా కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఏఎన్ఎంలను ఆరాతీసి, రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఆరోగ్యపరమైన సమస్యలతో బాధపడుతున్న ప్రయాణికులు, పాదచారులకు తక్షణమే వైద్యసేవలు అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

శరవేగంగా పటువర్ధనం-బాగెంపేట రోడ్డు నిర్మాణం



పట్టువర్ధనం దగ్గర జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

వంగర: మండల పరిధిలోని పటువర్ధనం–బాగెంపేట గ్రామాల మధ్య తారురోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో దాదాపు రూ.2.29 కోట్ల నిధులతో 3.4 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు మండల ఇంజినీరింగ్ అధికారి ఆనందరావు తెలిపారు.

5న సాఫ్ట్ బాల్ క్రీడాకారుల ఎంపిక

బొబ్బిలి: ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వేసవి సాఫ్ట్ బాల్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం మండలంలోని పారాది జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 5న నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, పీడీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2006 తరువాత పుట్టిన విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఎంపికకు ఆధార్, పుట్టిన తేదీ ధ్రువపత్రాలను తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారిని కడపలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

అందుబాటులోకి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

రాజాం: స్థానిక పట్టణంలో కూడా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అందుబాటులోకి వచ్చింది. సన్‌రైజ్ హాస్పిటల్‌లో హాస్పిటల్ ఎండీ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం ఓ వ్యక్తికి మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అందిస్తున్న ఈ సేవల కోసం రాజాం, రాజాం పరిసర ప్రాంతాల వాసులు మరెక్కడకూ వెళ్లాల్సిన పని లేదని ఎండీ తెలిపారు.